వారం రోజులుగా నీటి సరఫరా బంద్

- కలుషిత నీటి సరఫరా లైన్లను గుర్తించడంలో నిర్లక్ష్యం
- వారం రోజులుగా నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న ప్రజలు



కుర్మగూడ బస్తీలో కలుషిత నీరు సరఫరా అయ్యే పైప్‌లను చూపుతున్న మహిళలు

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్‌లో కలుషిత నీటి సరఫరా సమస్య పెరిగిపోతోంది. కుర్మగూడ, ఎరుకల బస్తీల్లో నిత్యం కలుషిత నీరు సరఫరా జరుగుతోంది. పైపులైన్లను గుర్తించేందుకు నీటి సరఫరా బంద్ చేశారు. దీంతో తాగునీరు లేక వారం రోజులుగా బస్తీవాసులు అలమటిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వారం రోజులుగా నీటి సరఫరా జరగకపోవడం దారుణమని స్థానికులు అంటున్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణిపై బస్తీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో బస్తీలోని మిగతా ప్రాంతాల్లో కొత్త పైపులైన్ల ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఆరు నెలల క్రితం కొంత మేర పైపులు వేసి మిగతాది వదిలేశారు. నాయకులు, ప్రజలు ఆరా తీయగా పైపుల కొరత ఉండటంతో పనులు పూర్తి చేయలేదని సమాధానమిచ్చినట్లు తెలిపారు. బస్తీల్లో కలుషిత నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచే బాధ్యత ఉపాధ్యాయులదే..

గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి



విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న చిలుకా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: విద్యార్థులు క్రమం తప్పకుండా క్రీడల్లో పాల్గొంటే శారీరకంగా, మానసికంగా బలంగా తయారవుతారని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుకా మధుసూదన్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో వనస్థలిపురం జోనల్ నారాయణ పాఠశాలల ప్రీమియర్ లీగ్ పేరిట నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్ వేడుకకు సోమవారం ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను తరగతి గదులకే పరిమితం చేయకుండా క్రీడలు, క్షేత్రస్థాయి పర్యటనలు, క్విజ్ పోటీలు తదితర వాటిలో ఆసక్తి పెంచే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని గుర్తు చేశారు. క్రీడల్లో విజేతలకు ఆయన చేతులమీదుగా జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఏజీఎం రవీంద్రబాబు, పాఠశాలల ప్రిన్సిపల్స్ అనూసింగ్, రవికుమార్, బాబ్జీ, నౌషిన్‌ఫాతిమా, మాధవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్



కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, మాణిక్యం అబ్రహం

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గం పాస్టర్స్, క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లో గ్రాండ్ క్రిస్మస్ సెలబ్రేషన్స్, అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, మాజీ క్రిస్టియన్ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, బీజేపీ మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిమధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల మాణిక్యం అబ్రహం అధ్యక్షతన జరిగిన సెలబ్రేషన్స్‌లో సిస్టర్ అనిత శిబారాణి, బ్రదర్స్ శ్రీధర్‌రాజ్, యూకే ప్రవీణ్, డేవిడ్, జరూసలేం మత్తయ్య, బిషప్‌లు సింగం, ఎంఎస్ దయానంద్, గోనె ఫిలిప్, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు సర్వే దోహదపడుతుంది

మాన్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సర్వేను పరిశీలిస్తున్న కొప్పుల నర్సింహారెడ్డి, అధికారులు

నాగోలు: జీహెచ్‌ఎంసీ చేపట్టిన ఘన వ్యర్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్) సర్వే నగర పరిశుభ్రతకు ఎంతగానో దోహదపడుతుందని, ఈ సర్వేకు ప్రజలు సహకరించాలని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాన్సురాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ నగర పరిశుభ్రతకు చేపట్టిన సర్వేలో భాగంగా సోమవారం మాన్సురాబాద్‌లో విజయశ్రీ కాలనీలో ఎస్‌డబ్ల్యూఎం ఈఈ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది చేపట్టిన ఈ సర్వే ట్రయిల్‌లో కార్పొరేటర్ సైతం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ వ్యర్థాల సేకరణ పద్ధతులు, చెత్త సేకరణ వాహనాల వినియోగం, వ్యర్థాల విభజన, ఈ వ్యర్థాల పారబోత, సేకరణ వంటి అంశాలను సేకరించి వాటి నిర్వహణపై స్థానికులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. ఇందుకు తమ సహకారం ఉంటుందని అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

డేంజర్ బెల్స్



ఆటోనగర్ జింకల పార్కు వద్ద ప్రమాదకరంగా గుంత

- విజయవాడ జాతీయ రహదారి విస్తరణలో భద్రత ప్రమాణాలు కరువు
- కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యంతో తరచూ ప్రమాదాలు
- ఉన్నతాధికారులు స్పందించాలంటున్న వాహనదారులు



విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్ మజీద్ దగ్గర ప్రమాదకరంగా గుంత



ఆటోనగర్ దగ్గర నడిరోడ్డులో వేసిన దిమ్మెలు

హస్తినాపురం: విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్, జింకలపార్కు దగ్గర రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ప్రమాదకరంగా మారిన గుంతలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై పనామా చౌరస్తా నుంచి మొదలుకొని హయత్‌నగర్ వరకు ఆరు నెలలకు పైగా కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ కనీస భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. ఇష్టానుసారంగా పనులు చేపడుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్నో ప్రమాదాలు జరిగాయని, అధికారులకు పలువురు ఫిర్యాదులు సైతం చేశారని, అయినా ఎందుకు స్పందించడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని వాహనదారులు కోరుతున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే..



విజయవాడ జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపంతోనే ఆటోనగర్, జింకలపార్కు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

– బొల్లం సాయికిరణ్, ఇంజినీరింగ్ విద్యార్థి

నేటి నుంచి కుటుంబ సర్వే ఎంట్రీ



డేటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ

చాదర్‌ఘాట్: 20 రోజుల నుంచి జరుగుతున్న కుటుంబ సమగ్ర సర్వే వివరాలను మంగళవారం నుంచి కంప్యూటర్లలో ఎంట్రీ జరుపుతున్నట్లు మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది ఆపరేటర్లతో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు డేటా ఎంట్రీ కొనసాగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు 82 శాతం పూర్తయినట్లు తెలిపారు. ఎంట్రీ ఆపరేటర్లు తప్పుడు ఎంట్రీలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సూపర్‌వైజర్లు సాబేర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

నాగోలు: ఏకలవ్య కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా బుడ్డ సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సుల్తాన్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొనేటి చిన్ననర్సింహ, కాలనీ వ్యవస్థాపకుడు వనం గంగయ్య, సభ్యులు సెద్దిని స్వామి, కండల శంకరయ్య, గణేష్, ధనుంజయ, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ చేయడానికి వెళ్లిన బాలుడి అదృశ్యం



మహమ్మద్ మోసిన్ (ఫైల్)

నాగోలు: టిఫిన్ చేయడానికి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన బాలుడు అదృశ్యమైన సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నాగోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జైపూరికాలనీలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్ చెందిన మహమ్మద్ మోసిన్ 15 ఏళ్ల బాలుడు ఈనెల 24న ఉదయం టిఫిన్ తినడానికి టిఫిన్ సెంటర్‌కు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. అతను ఇంటికి రావకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలల్లో వెతికిన ప్రయోజనం లేకపోవడంతో కుటుంబ సభ్యులు సోమవారం నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దీక్షాదివస్‌ను విజయవంతం చేద్దాం



అరవింద్ శర్మ

దిల్‌సుఖ్‌నగర్: బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించే దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ పిలుపునిచ్చారు. ఆర్‌కేపురంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దీక్షా దివస్‌కు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని శంషాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలోని ముఖ్య నాయకులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న బేర బాలకిషన్ తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వచ్చేనెల 1వ తేదీన నిర్వహించే మాలల సింహగర్జన సభకు మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్, సరూర్‌నగర్ డివిజన్ నుంచి వేలాదిమంది మాలకులస్తులు, మాల ఉద్యోగులు, మాల సంఘాల విద్యార్థులు, యువకులను పెద్ద ఎత్తున తరలిస్తామని తెలంగాణ మాలల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బేర బాలకిషన్ తెలిపారు. రామకృష్ణాపురం డివిజన్‌లోని ఆంజనేయ స్వామి టెంపుల్ చౌరస్తాలో రామకృష్ణాపురం డివిజన్ మాల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు ముచింతల జగన్, ప్రధాన కార్యదర్శి ఏనుక యాదయ్య ఆధ్వర్యంలో మాలల సింహగర్జన వాల్ పోస్టర్‌ను సోమవారం బాలకిషన్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ డిసెంబర్ ఒకటో తేదీన జరిగే మాలల సింహగర్జనకు తెలంగాణలో ఉన్న మాల శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు అందరూ కలిసి వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణాపురం డివిజన్ సరూర్‌నగర్ డివిజన్‌ల మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అల్వాల్: యాప్రాల్‌లోని ఎంప్లాయిస్ కాలనీలో లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్, బేగంపేటకు చెందిన సన్‌షైన్ కిమ్స్ ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత మోగా వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు బీపీ, షుగర్, బరువు, ఎత్తు, ఈసీజీ, బీఎండీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్లు శ్రవణ్‌కుమార్, రాజ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు డాక్టర్ సత్యనారాయణబాబు మాట్లాడుతూ.. ట్రస్టు ఏర్పడి పదేళ్లు అవుతుందన్నారు. ట్రస్టు పదో వార్షికోత్సవం సందర్భంగా సుమారు 300 మందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించామని తెలిపారు.

6నెలల్లో పాఠశాలకు శాశ్వత భవనం నిర్మిస్తాం

మేడ్చల్ డీఈవో విజయకుమారి



స్థలాన్ని పరిశీలిస్తున్న డీఈఓ విజయకుమారి, ఎంఈఓ రామారావు తదితరులు

నాగోలు: డివిజన్ పరిధిలోని బండ్లగూడ ప్రాథమిక పాఠశాలను మేడ్చల్ డీఈవో విజయకుమారి, ఉప్పల్ మండల ఎంఈఓ రామారావు సోమవారం పరిశీలించారు. పాఠశాల కోసం కేటాయించిన 278 గజాల స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా కబ్జా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విద్యాశాఖ అధికారులు స్థలాన్ని పరిశీలించారు. అక్టోబర్ 21న ఓ ప్రైవేట్ వ్యక్తి కోర్టులో దావా దాఖలు చేసి కోర్టులో తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని పోలీసు ప్రొటక్షన్ సహాయంతో పాఠశాల భవనాన్ని కూల్చివేశారని తెలిపారు. అదే అదనుగా భావించి మరికొంత మంది వ్యక్తులు పాఠశాల స్థలాన్ని కబ్జా చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా డీఈవో విజయకుమారి మాట్లాడుతూ పాఠశాలకు కేటాయించిన స్థలంలో మరో ఆరు నెలల్లో పాఠశాలకు శాశ్వత భవనం నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బండ్లగూడ ప్రాథమిక పాఠశాల పరిరక్షణ సమితి సభ్యులు సీహెచ్ జంగయ్య, తూర్పాటి చిరంజీవి, సహదేవ్‌గౌడ్, శ్రీనివాస్ చారి, వెంకటేష్, గద్దం రామారావు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ఉప్పల్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పాఠశాలకు మధ్యాహ్న భోజనం అందించే మిడ్ డే మీల్స్ తయారీ కేంద్రాన్ని సోమవారం మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ గౌతమ్ తనిఖీ చేశారు. ఉప్పల్ పారిశ్రామికవాడలోని మన్నా ట్రస్ట్ ద్వారా రోజూ రూ.80,000 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి ప్యాక్ చేసి అందించే కేంద్రాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

గోడౌన్ పరిశీలన..

భోజనం వండే విభాగం, స్టోరేజ్ గది, గోడౌన్‌ను కలెక్టర్ పరిశీలించారు. ప్రతిరోజూ ఎంత మందికి అన్నం వండుతారని, ఎప్పటి నుంచి వంటలు మొదలు పెడతారని, తదితర విషయాలను నిర్వాహకులు రమణారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారాన్ని విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

తేదీ తప్పనిసరి..

వంట సామగ్రిని పొడి ప్రాంతాల్లో నిల్వ ఉంచాలని, వంట చేసే ముందు ఎక్స్‌పైరీ తేదీని పరిశీలించిన తర్వాతే వంట ప్రారంభించాలని సూచించారు. ఉప్పల్ తహసీల్దార్ వాణిరెడ్డి, విద్యాశాఖ అధికారి విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహా శివుడికి ఘనంగా పూజలు

- కార్తీక మాసం చివరి సోమవారం.. భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



శివగంగాకాలనీలో కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్



దుర్గాదేవి ఆలయంలో కాశీ విశ్వేశ్వర స్వామికి పూజలు

నాగోలు: కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని శివగంగా కాలనీలోని శివాలయంలో మహాశివుడికి అన్న ప్రసాద అభిషేకం నిర్వహించారు. కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ అధ్యక్షుడు లక్ష్మీపతిగౌడ్, అంబాలా మల్లేష్, సుబ్బారావు, ఆంజనేయులు, నర్సింగ్, నాయకులు తోట మహేందర్ యాదవ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గాదేవి దేవాలయంలో..

మాన్సురాబాద్ సాయినగర్ కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో కాశీవిశ్వేశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం, రుద్ర హవనం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ పోచబోయిన గణేష్ యాదవ్, పురోహితులు బాల మురళీవర్మ, యాదగిరి, హన్మంతరావు, రమేష్, రవి, మురళి, అశోక్, రమణమూర్తి, అజయ్, లక్ష్మయ్య, కేశవులు, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బజారులలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు.. (కిలో.. రూపాయల్లో) టమాటా రూ.35, వంకాయ రూ.40, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.28, కాకర రూ.23, బీర రూ.38, క్యాబేజీ రూ.28, ఫ్రెంచి బీన్స్ రూ.50, క్యారెట్ రూ.60, దొండ రూ.28–40, చిక్కుడు రూ.23–55, గోకర రూ.28, బీట్‌రూట్ రూ.45, క్యాప్సికం రూ.65, ఆలు రూ.37, దోస రూ.28, సొర రూ.15, పొట్ల రూ.23, ఉల్లిగడ్డ రూ.45, చామ గడ్డ రూ.35.

గమనిక: ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు ఇలా.. టమోటా రూ.33, వంకాయ రూ.35, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.25, క్యారెట్ రూ.60, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.37, ఉల్లిగడ్డ రూ.45, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.28, సొరకాయ రూ.15, పొట్లకాయ రూ.19, చిక్కుడు రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.205, చిలుగడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.45, కీర రూ.17, బీన్స్ రూ.45, క్యాప్సికమ్ రూ.60. మంగళవారం ఉదయం 9 గంటల వరకు ధరలు వర్తిస్తాయి.

ఘనంగా గడప ప్రతిష్ఠ పూజలు



చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ ధోబీగల్లీలోని శ్రీమహంకాళి దేవాలయంలో గడప ప్రతిష్ఠ పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో సుదర్శన్‌బాబు,బాబు శ్రీనివాస్, నర్సింగ్‌రావు, ఆగమయ్య, చౌకి రవికుమార్, లక్ష్మణ్, వీరాస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ యాదయ్య

చంపాపేట: ప్రజావాణిలో అర్జీల రూపంలో ఫిర్యాదు చేసిన వారి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హయత్‌నగర్ డీసీ తిప్పర్తి యాదయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. ప్రజావాణిలో టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, ప్రాపర్టీ ట్యాక్స్ వంటి పలు సమస్యలపై స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు.

దివ్యాంగులు ఆర్థికంగా ఎదగాలి



దివ్యాంగుల సంఘాల నాయకులతో డైరెక్టర్ బి.శైలజ

చాదర్‌ఘాట్: దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగి సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని వికలాంగుల సంక్షేమశాఖ రాష్ట్ర డైరెక్టర్ బి.శైలజ అన్నారు. మలక్‌పేటలోని వివిధ సంఘాల నాయకులు ఎన్‌పీడీఓ అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో సోమవారం డైరెక్టర్ బి.శైలజను కలిసి సమస్యలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులమని కుంగిపోకుండా జీవితంలో ముందుకు వెళ్లాలని అన్నారు. ఆ దిశగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలని అన్నారు. అదేవిధంగా సమస్యలు ఉంటే తన దృష్టికి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం

లింగోజిగూడ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. హయత్‌నగర్ రామానుజనేయ కాలనీకి చెందిన చౌదరి కిషోర్ కుమార్ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 24వ తేదీన సాయంత్రం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లాడు. సోమవారం కుటుంబ సభ్యులు కిషోర్‌కు ఫోన్ చేయగా సిచ్ఛాఫ్ వచ్చింది. దీంతో స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తండ్రి రమేష్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

లింగోజిగూడ: నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని బైక్ ఢీకొట్టడంతో గాయాలైన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగనూరుకు చెందిన పంతుగారు గణపతి కుమార్ పూజారి. స్థానికంగా పూజలు పూర్తి చేసుకొని ఇంటికి వెళ్తుండగా ఆదివారం రాత్రి 10.30గంటల సమయంలో బైక్‌పై నిర్లక్ష్యంగా వచ్చిన వ్యక్తి గణపతికుమార్‌ను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించారు. గణపతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రిని కలిసిన మేయర్



బోడుప్పల్: వక్ఫ్‌బోర్డు విషయంలో కలెక్టర్ ఇచ్చిన నివేదికను రెవెన్యూశాఖ త్వరగా పరిష్కరించాలని సోమవారం బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కలిశారు. చెరువుల అభివృద్ధి విషయంలో ఎన్‌టీసీ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడాలని కోరగా, వెంటనే మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారన్నారు.